# ఏపీ సీఎంపై అమెరికాలో ఫిర్యాదు

(మొదటిపేజీ తరువాయి)

అనే పట్టణానికి వెళ్లారు. అదే సమయంలో ఇర్వింగ్ మేయర్ బేత్‌వాన్ డ్యాన్‌కు 'ఇండియన్స్ ఫైటింగ్ ఫర్ హ్యూమన్ రైట్స్ పేరిట' కొంతమంది ఈ-మెయిల్స్ పంపించారు. "ఎర్రచందనం స్మగ్లర్ల పేరుతో చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో 25 మందిని చంపించారు. ఆయన ఇప్పుడు ముందస్తు అనుమతి లేకుండా అమెరికాలో పర్యటిస్తున్నారు. అక్రమంగా భారీ ఎత్తున నిధులు సేకరిస్తున్నారు. దీనిపై విచారణ జరిపించండి" అని వారు ఈ-మెయిల్స్‌లో కోరారు. వీటిని చూడగానే ఇర్వింగ్ మేయర్ అప్రమత్తమయ్యారు. ఈ సమాచారాన్ని పోలీసులకు అందించారు. ఇర్వింగ్ పోలీసులు హుటాహుటిన... చంద్రబాబు ప్రవాసాంధ్రులతో సమావేశమైన చోటుకు వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక చూస్తే... పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. భారీ సంఖ్యలో హాజరైన ప్రవాసాంధ్రులు, ప్రముఖులతో అంతా కోలాహలంగా ఉంది. ఈ కార్యక్రమంలో ప్రవాసులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. ఇది ఉన్నతస్థాయి రాజకీయ ప్రతినిధులకు చెందిన సమావేశమని పోలీసులు గ్రహించారు. చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రి అని, పెట్టుబడులు ఆహ్వానించేందుకు ప్రవాసాంధ్ర ప్రముఖులతోపాటు, అమెరికాకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులతో అధికారికంగా సమావేశమవుతున్నారని తెలుసుకున్నారు. తమకు వచ్చిన మెయిల్స్‌లో వాస్తవం లేదని అర్థం చేసుకున్నారు.

**తామే భద్రత కల్పించి...**

'చంద్రబాబుపై చర్యలు తీసుకోండి' అనే ఫిర్యాదుపై రంగంలోకి దిగిన ఇర్వింగ్ పోలీసులు... ఆ తర్వాత ఆయన కార్యక్రమానికే భద్రత కల్పించారు.దీంతో కార్యక్రమ నిర్వాహకులు కూడా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే... విదేశాల నుంచి వచ్చిన నాయకులకు అక్కడి పోలీసులు భద్రత ఏర్పాటు చేయరు. దీంతో, భద్రత ఎందుకు కల్పించారంటూ వారు నేరుగా పోలీసులనే అడిగారు. దీంతో వారు తమకు అందిన ఈ-మెయిల్ ఫిర్యాదుల గురించి వెల్లడించారు. తప్పుడు ఈ-మెయిల్స్ పంపిన వ్యక్తుల నుంచి భద్రతాపరమైన సమస్యలు ఏర్పడవచ్చునన్న అనుమానంతో, తమకు తాముగానే భద్రత కల్పించామని వారు వివరించారు. వైసీపీ మద్దతుదార్ల వ్యవహారశైలిపై రాజకీయ వర్గాలు విస్తుపోతున్నాయి. పెట్టుబడుల సమీకరణకు వెళ్లిన ముఖ్యమంత్రిపై ఇలా ఫిర్యాదులు చేయడం దేనికి సంకేతమని అవి ప్రశ్నిస్తున్నాయి. పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక నాయకులు పార్టీలకు అతీతంగా ఏకమై రాష్ట్రాభివృద్ధి కోసం పోరాడుతుంటే, ఏపీ పార్టీలు ఇలా కొట్లాడుకోవడం ఏమీ



మహాత్ముని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ సీఎం

బాగా లేదని సీనియర్ రాజకీయ నాయకుడొకరు ఆక్షేపించారు. ఇది తమ పార్టీ చేసిన మరో ఘోర తప్పిదమని పేరు రాయడానికి అంగీకరించని వైసీపీ నేత ఒకరు అన్నారు. పార్టీ నాయకత్వానికి తెలిసి జరిగినా, తెలియక జరిగినా ఈ పాపం పార్టీ మోయక తప్పదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. "తెలుగువాళ్లకు పీత రాజకీయాలు అలవాటనే అభిప్రాయం ఉంది. ఇప్పుడది నిజమైంది. పాండవులుగా ఐదుగురం! కౌరవులుగా వందమందిమి! మా జోలికి ఎవరైనా వస్తే... మేమంతా కలిసి నూట ఐదుగురం అనేలా వ్యవహరించాల్సిన ఈ తరుణంలో చిల్లర రాజకీయాలతో పరువు తీస్తున్నారు" అని ఆయన విశ్లేషించారు. అయితే దీంతో తమకేమీ సంబంధం లేదని వైసీపీ నాయకులు పేర్కొంటున్నారు.

**జగన్ మీడియా బృందం వికృత చేష్టలు: సోమిరెడ్డి**

రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేలా జగన్ మీడియా బృందం కుట్రలు, కుతంత్రాలు సాగిస్తోందని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. " రాష్ట్ర అభివృద్ధి కోసం చేస్తున్న పర్యటనపై తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గం. చంద్రబాబుకు అమెరికాలోని తెలుగువారు ఘన స్వాగతం పలికారు. దీనిని జీర్ణించుకోలేక జగన్ బృందం సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి దిగింది. జగన్ అభివృద్ధి నిరోధకుడు" అని సోమిరెడ్డి తెలిపారు.

# ఏపీకి డెల్.. బెల్!

- **డేటా సెంటర్ ఏర్పాటుకు డెల్ సుముఖం**
- **రాష్ట్రంలో బెల్ హెలికాప్టర్ల తయారీ కేంద్రం**
- **బెల్ డైరెక్టర్ చాద్ స్పార్క్స్‌తో సీఎం భేటీ**

అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ దిగ్గజం 'డెల్' అమరావతి దిశగా అడుగులు వేస్తోంది. దీంతోపాటు హెలికాప్టర్ల తయారీలో ప్రపంచ ఖ్యాతి చెందిన 'బెల్' కూడా నవ్యాంధ్రలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సుముఖత తెలిపింది. అమెరికాలో మూడో రోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు బృందం డాలస్‌లో డెల్ ప్రతినిధి శ్రీకాంత్ సత్యతో భేటీ అయింది. అమరావతిలో కానీ.. రాష్ట్రంలో మరెక్కడైనా కానీ డెల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు శ్రీకాంత్ సత్య సంసిద్ధత వ్యక్తం చేశారు. అనంతరం సీఎం బృందం బెల్ సంస్థ ప్రతినిధులతో సమావేశమైంది. రాష్ట్రంలో పెట్టుబడిదారుల కోసం ఆకర్షణీయమైన 'విమానయాన విధానం' తీసుకొచ్చామని బెల్ డైరెక్టర్ చాద్ స్పార్క్స్ బృందానికి సీఎం వివరించారు. ఈ రంగంలో 75 మిలియన్ డాలర్లకు మించి పెట్టుబడులు పెట్టే సంస్థలకు 'టైలర్ మేడ్' పాలసీని సిద్ధం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రానికి స్వయంగా వచ్చి పెట్టుబడుల వాతావరణాన్ని పరిశీలించాలని చాద్ బృందాన్ని సీఎం ఆహ్వానించారు. రాష్ట్రంలో హెలికాప్టర్ తయారీ సదుపాయాల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చాద్ సీఎంకి హామీ ఇచ్చారు. అనంతరం సీఎం బృందం అయోవాకు చేరుకుంది. అక్కడ అయోవా స్టేట్ యూనివర్సిటీకి చెందిన సీడ్ సైన్స్ సెంటర్‌తో ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

ఐటీ రంగంలో పేరొందిన 28 సంస్థలకు చెందిన ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. వీరంతా ప్రవాసాంధ్రులే. అమరావతి, విశాఖ నగరాల్లో లీజుకు తీసుకున్న స్థలాల్లో కార్యకలాపాలను చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఈ సంస్థల ప్రతినిధులు సీఎం బృందానికి స్పష్టం చేశారు. ఈ కంపెనీల రాకతో ప్రాథమిక దశలో విశాఖలో 310, అమరావతిలో 64 మందికి ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చినా సాంకేతికతను